మాట్లాడుతున్న గొత్తికోయలు

మేము సాగు చేస్తే మరాకరికి హక్కు పత్రాలా ?

రాయంబంధం గ్రామ గొత్తికోయలు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 23 : మేము 25 ఏండ్లుగా కాస్తు చేసుకుంటున్న పోడు భూమిని అటవీ శాఖ అధికారులు సర్వే చేసి ఇతరుల పేరు పైకి ఎక్కించి తమకు అన్యాయం చేశారంటూ మండలంలోని చిన్నబోయినపల్లి పంచాయతీ పరిధి రాయంబంధం గ్రామానికి చెందిన గొత్తికోయలు పదం పొజ్జయ్య, కబ్మా గంగయ్య, మడకం సమ్మయ్య ఆరోపించారు. గత ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇచ్చే క్రమంలో ఆర్‌వోఎఫ్‌ఆర్ సర్వే నిర్వహించిందని, కానీ, అధికారుల నిర్లక్ష్యంతో ఇదే భూమికి హక్కు పత్రాలు వేరే వారి పేరుపై వచ్చాయని తెలిపారు. గూడెంలోని పెద్దలు సోడి బండి, కారం మల్లేశ్, సోడి రమేశ్, మడకం రాములు మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం ఛత్తీస్‌గఢ్ నుంచి బతుకు దెరువు కోసం ఇక్కడకు వచ్చామని, గత ప్రభుత్వం రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఇచ్చిందన్నారు. ఇంటి పన్ను కూడా చెల్లిస్తున్నామన్నారు. సర్వే జరిగిన సమయంలో ఉన్న బీట్ ఆఫీసర్‌కు కూడా తాము సాగు చేస్తున్న విషయం తెలుసన్నారు.

గొత్తికోయలకు అన్యాయం చేశారు

కాగా, 2023లో సర్వే జరిగిన సమయంలో తాను చిన్నబోయినపల్లి ఎఫ్‌ఆర్‌సీ కమిటీ కార్యదర్శిగా ఇక్కడ ఉన్నానని చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన రైతు సంఘం నాయకుడు వడకాపురం సారయ్య తెలిపారు. అప్పటి ఫారెస్టు బీట్ ఆఫీసర్ తప్పుగా నమోదు చేయడం వల్లే గొత్తికోయలకు అన్యాయం జరిగిందన్నారు. భూమితో సంబంధం లేని వ్యక్తి పేరుపై ఎలా రికార్డుల్లోకి ఎక్కిస్తారని ప్రశ్నించారు. వెంటనే తొలగించి సాగు చేసుకుంటున్న వారికి న్యాయం చేయాలని కోరారు. సదరు బీట్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గొత్తికోయలకు న్యాయం జరగకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పస్రాలో దొంగతనం

రూ.75 వేల నగదు అపహరణ

బీరువా తాళాలు పగలగొట్టి చిందరవంద వేసి ఉన్న వస్తువులు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 23 : మండలంలోని పస్రా గ్రామానికి చెందిన కొండి సంపత్‌రెడ్డి ఇంట్లో దొంగలు పడి రూ.75వేల నగదు ఎత్తుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు సంజీవరెడ్డి కథనం ప్రకారం.. ఈ నెల 20న తన కుటుంబ సభ్యులతో కలిసి వేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుపతి వెళ్లారు. అనంతరం ఆదివారం ఉదయం గ్రామానికి చేరుకున్నారు. గేటు తాళం తీసి వెళ్లగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బట్టలు చిందరవందర వేసి రూ.75 వేలు ఎత్తుకెళ్లారన్నారు. వేసిన గేటు తాళం అలాగే ఉండి ఇంటి పక్కన వారికి ఎలాంటి శబ్దాలు రాకుండా దొంగతనం జరగడంపై పలువురు భయాందోళన చెందుతున్నారు. కాగా, సంఘటనపై పస్రా పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు పేర్కొన్నారు.

అధిక లోడ్‌తో వెళ్తున్న 13 ఇసుక లారీలు సీజ్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 23 : అధిక లోడ్‌తో రవాణా అవుతున్న 13 ఇసుక లారీలను గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. ఏఎస్సీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం నుంచి మండలంలోని చిన్నబోయినపల్లి వే బ్రిడ్జి వద్ద ఇసుక లారీలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం వీరాపూర్ ఇసుక క్వారీ నుంచి వస్తున్న లారీలను వే బ్రిడ్జి వద్ద తనిఖీ చేయగా ఒక్కో లారీలో టన్నున్నర ఇసుక అధికంగా ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. 13 లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Hema Motors needs Sales Executive: any Degree 2 wheeler must, Accountant: good Knowledge in Tally must and Min 1 to 2 Yrs of Exp in Automobile Dealership Walk in Interview with resume on 24th & 25th Feb 2025 between 11 am to 6.pm Cont: Hema Motors Pvt Ltd, Opp: Govt ITI, Mulugu Road, Wgl, Cell: 8008204442, 9154921942.
NTW-15465

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

బ్రాండెడ్ కంపెనీ అని కొంటే బెండ్లు మిగాలాయి

- నకిలీ విత్తనాలతో నిండా మునిగిన మక్కజొన్న రైతులు
- కంపెనీపై చర్యలు తీసుకోని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

ఏపుగా పెరిగినా గింజలురాని మక్కజొన్న చేను

గింజలులేని కంకులను పరిశీలిస్తున్న ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 23 : మంచి విత్తనాలు కొని అధిక దిగుబడి సాధించాలనుకున్న ఆ రైతుల ఆశలపై నకిలీ విత్తనాలు నీళ్లు చల్లాయి. మక్కజొన్న పంట ఏపుగా పెరిగినా బెండ్లకు గింజలు లేకపోవడంతో నిండా మునిగారు. మండల వ్యాప్తంగా రైతులు 50 ఎకరాల్లో ఓ బ్రాండెడ్ కంపెనీకి చెందిన మక్కజొన్న విత్తనాలను సాగు చేశారు. ఆడ, మొగ విత్తనాలు ఇచ్చిన కంపెనీవారు, ఆరు సాళ్లు ఆడ విత్తనం ఒక సాలు మొగ విత్తనం నాటించారు. ఏపుగా పెరిగిన తర్వాత కంకులకు గింజలు తయారు కాకపోవడంతో కంపెనీకి చెందిన ప్రతినిధులను ఇటీవల రైతులు నిలదీశారు. దీంతో కొంత నష్టపరిహారం కట్టించి, గింజలు లేని వట్టి బోండాను బాండ్ రేటు చెల్లించి కొంటామని చెప్పడంతో రైతులు శాంతించారు. నాసిరకం మొక్కజొన్న విత్తనాల వల్ల గింజలు లేకుండా వట్టి బోండా మాత్రమే ఉండటంతో తూకం లేక ఎకరాకు 20 క్వింటాల దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కంపెనీపై అధికారులు చర్యలు తీసుకోవాలి

నఖిలీ విత్తనాలు రైతులకు అమ్మి మోసం చేసిన కంపెనీపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సదరు కంపెనీ నష్ట పరిహారం కట్టిస్తామని చెప్పి జాడలేకుండా పోయిందని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి కంపెనీపై చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

మహా శివరాత్రిని విజయవంతం చేయాలి

రామప్పలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క

పత్తి కొనుగోలు చేయాలని మంత్రికి వినతి

వెంకటాపూర్, ఫిబ్రవరి 23 : మహా శివరాత్రి మహోత్సవాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఆమె రామప్ప దేవాలయాన్ని సందర్శించగా రామప్ప పరిరక్షణ సమితి కన్వీనర్ ఆకిరెడ్డి వెంకట రామ్మోహన్‌రావు, నాయకులు స్వాగతం పలికారు. రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేయగా అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో ఏర్పాట్లపై ఈవో శ్రీనివాస్, అర్చకులు సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 28 వరకు మహా శివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఆమె వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్, నాయకులు భగవాన్‌రెడ్డి, బండి శ్రీనివాస్, వకుళభరణం శ్రీనివాస్ ఉన్నారు.

పత్తి కొనుగోలు చేయాలని మంత్రికి వినతి

ములుగురూరల్ : ములుగు జిల్లాలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయడంతో పాటు మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి క్వింటాకు రూ.35వేలు చెల్లించాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అమ్జద్‌పాషా, నాయకులు బోడ రమేశ్, గొంది సాంబయ్య, తిరుపతి, రామయ్య మంత్రి సీతక్కకు ములుగులో వినతిపత్రం అందజేశారు. జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల్లో పత్తి పంట సాగయిందని, అధిక వర్షాలతో పత్తి చేతికి అలస్యంగా వచ్చిందని తెలిపారు. రైతుల వద్ద సుమారు 50వేల క్వింటాళ్ళ పత్తి మిగిలి ఉన్నందున మార్చి మొదటి వారం వరకు కొనుగోలు చేపట్టాలన్నారు. మిర్చి పంట సుమారు 25వేల ఎకరాల్లో సాగైందని, గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలుకు రూ.25 వేల చొప్పున చెల్లించాలని, ములుగు ప్రాంతంలో శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లెల్ల కుమార్ 2వ వర్ధంతి కార్యక్రమానికి మంత్రి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



వెంకటాపూర్ : రామప్పలో ఏర్పాట్లపై ఈవో, పూజారితో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మాట్లాడుతున్న సుభద్రశ్యామల

స్వేరోస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ములుగురూరల్, ఫిబ్రవరి 23 : మల్లంపల్లి మండలకేంద్రంలో ఆదివారం స్వేరోస్ జిల్లా నూతన కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అమ్మఒడి సుభద్ర శ్యామల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా వీరబోయిన విజయలక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఎండీ పాషా, పోరిక రజిత, ప్రధాన కార్యదర్శిగా ఎంపెల్లి రాజు, కోశాధికారిగా పోరిక బాలాజీ, అధికార ప్రతినిధిగా డాంగి సురేందర్‌నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కావేరి రజినీకాంత్, సహాయ కార్యదర్శిగా నేరెళ్ల శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా అన్నారపు కిషన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సుభద్రశ్యామల మాట్లాడుతూ స్వేరోయిజం నూతన వన సమాజ నిర్మాణానికి, స్వేరోస్ ఫౌండేషన్ చైర్మన్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆశయాలను కమిటీ గ్రామ గ్రామాన తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో స్వేరో ఎస్డీసీ ఇన్‌చార్జి బొట్ల ప్రశాంత్, ఈసీ మెంబర్ మారెపల్లి మనోజ్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి శనిగరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పులి సంచారం కలకలం

ఎన్కపల్లి అటవీ సమీపంలో అధికారులు గుర్తించిన పులి పాదముద్రలు

మహదేవపూర్ (కాటారం), ఫిబ్రవరి 23 : మండలంలోని రాపల్లి కోట, ఎన్కపల్లి గ్రామ సమీపంలోని అటవీ క్షేత్రంలో పులి సంచారం కలకలం రేపుతోంది. శనివారం కాటారం వీరాపూర్ అడవిలో సంచరించిన ఆనవాళ్లను అటవీ శాఖ అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. కాగా, ఆదివారం మహదేవపూర్ మండల పరిధిలోని బొమ్మాపూర్ అటవీ క్షేత్రం నుంచి రాపల్లికోట, ఎన్కపల్లి మీదుగా పలిమెల అడవుల్లోకి ప్రవేశించిందని ఎఫ్‌ఆర్‌వో రవి తెలిపారు. పులి జాడ కోసం ప్రత్యేకంగా ట్రాకింగ్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమీప గ్రామ ప్రజలు అడవుల్లోకి వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పులి ఆనవాళ్లు గుర్తిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అడవి జంతువు దాడిలో ఆవు మృతి

మల్హార్, ఫిబ్రవరి 23 : మండలంలోని తాడిచెర్ల జీపీ పరిధి కాపురం అటవీ ప్రాంతంలో ఆదివారం అడవి జంతువు దాడిలో ఆవు మృతి చెందింది. రైతు రఘుపతికి చెందిన ఆవులు కాపురం అటవీ ప్రాంతంలోకి మేతకు వెళ్లగా, ఒక ఆవుపై అడవి జంతువు దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దాని మెడపై తీవ్రమైన గాట్లు ఉండటంతో పెద్దపులి దాడి చేసి ఉంటుందని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ రేంజర్ రాజేశ్వర్‌రావును అడుగగా పెద్దపులి దాడి చేసినట్లు నిర్ధారించలేమని, సోమవారం కాపురం అడవి ప్రాంతంలోకి వెళ్లి పరిశీలిస్తామని తెలిపారు. అంతవరకు గ్రామస్తులు అటవీ ప్రాంతాల వైపు వెళ్తొద్దని, రైతులు వ్యవసాయ పనులు త్వరగా ముగించుకొని ఇండ్లకు చేరుకోవాలని సూచించారు.

దోపిడి రహిత సమాజం కోసం పాటుపడాలి

గోవిందరావుపేట, ఫిబ్రవరి 23 : దోపిడీ రహిత సమాజం కోసం పాటుపడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం పస్రాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడి దారి సమాజంలో ఆర్థిక సంక్షోభం 2002 నుంచి నేటి వరకు కొనసాగుతూనే ఉందన్నారు. ప్రజలకు కొనుగోలు శక్తి పెరగకుండా ఈ సంక్షోభం ఇలాగే ఉంటుందని, సోషలిస్టు సమాజంలో మాత్రమే దీనికి పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త దోపిడీ రహిత సమాజం కోసం, పెట్టుబడుదారి వ్యవస్థ మార్పు కోసం కృషి చేయాలని కోరారు. నాయకులు పొదిళ్ల చిట్టిబాబు, తీగల ఆదిరెడ్డి, గొంది రాజేశ్, లెనిన్, కృష్ణారావు, రమేశ్, సువర్ణ, కవిత, రాజేశ్వరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకులాల ప్రవేశ పరీక్ష

ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో పరీక్ష రాసిన విద్యార్థులు

కాటారం పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి శైలజ

ములుగురూరల్/ కృష్ణకాలనీ/ ఏటూరునాగారం/ వాజేడు/ మహదేవపూర్ (కాటారం) / మొగుళ్లపల్లి/ చిట్యాల, ఫిబ్రవరి 23 : రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల్లో 2025-26 సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశం, 6 నుంచి 9 తరగతుల్లో బ్యాక్ లాగ్ ఖాళీలకు ఆదివారం ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ములుగు మండలం జాకారం బాలుర గురుకుల పాఠశాలలో 543 మంది విద్యార్థులకు 532 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. వెంకటేశ్వర్లు తెలిపారు. ఏటూరునాగారం గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహించిన పరీక్షకు 343 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి చెప్పారు. వాజేడు మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 121 మంది పరీక్ష రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్, వెంకటాపురం టీజీడబ్ల్యూఆర్ ఎస్ కళాశాల ప్రిన్స్‌పాల్ కిరణ్మయి తెలిపారు. కాటారం మండలకేంద్రంలోని బాలుర కళాశాల పరీక్షా కేంద్రంలో 479 మంది విద్యార్థులకు 467 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్, జిల్లా గిరిజన గురుకులాల సమన్వయ అధికారి రాజేందర్ చెప్పారు. మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర పాఠశాలలో 233 విద్యార్థులు పరీక్ష రాశారు. బాలురలో ఒకరు, బాలికలో ఇద్దరు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ శారద తెలిపారు. చిట్యాల మండలకేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో 661 మంది, మోడల్ స్కూల్లో 352 మంది పరీక్షకు హాజరైనట్లు గురుకులాల జిల్లా సమన్వయ అధికారి గోల్కొండ భిక్షపతి పేర్కొన్నారు. సోషల్ వెల్ఫేర్ పాఠశాల సెంటర్ విద్యార్థి మోడల్ స్కూల్‌కు వెళ్లగా ఏఎస్సై సమ్మిరెడ్డి, పోలీస్ సిబ్బంది అతడిని సకాలంలో సెంటర్‌కు చేర్చారు. చిట్యాల, కాటారం మండల కేంద్రాల్లోని పరీక్ష కేంద్రాలను నోడల్ అధికారి శైలజ తనిఖీ చేశారు.

ఏటూరునాగారం : పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

వాజేడు : పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

వామ్మో.. వానరాలు

- ప్రజలను బెంబేలెత్తిస్తున్న కోతులు
- ఇండ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి

ములుగురూరల్, ఫిబ్రవరి 23 : ములుగు జిల్లాకేంద్రంలో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రింబవళ్లు కాలనీల్లో సుమారు 300 వానరాలు తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇండ్లలోకి చొరబడి వస్తువులు, సామాగ్రిని చిందర వందర చేస్తున్నాయి. నాలుగు నెలల క్రితం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంతో కోతులను పట్టించారు. వాటిని ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో వదాల్సింది పోయి సదరు వ్యక్తులు గట్టమ్మ గుడి వద్ద వదిలేశారు. రెండు కిలో మీటర్ల దూరంలోనే వదిలివేయడంలో తిరిగి ములుగు జిల్లా కేంద్రాని చేరుకున్నాయి. కోతులను తరిమేందుకు ధైర్యం చేసి కర్రలతో బెదిరించే ప్రయత్నం చేసిన వారిపై ఎదురు దాడికి దిగి కరుస్తున్నాయి. దీంతో ప్రజలు కోతుల నుంచి తమను రక్షించాలని, వాటిని బంధించి అభయారణ్యంలో వదిలివేయాలని ప్రజలు కోరుతున్నారు. జీపీ కార్యదర్శితో పాటు సిబ్బందికి పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని కోరుతున్నారు.

ములుగు జిల్లా కేంద్రంలో సంచరిస్తున్న కోతులు

ప్రభుత్వ దవాఖాన ఎదురుగా పార్క్ చేసి ఉన్న లారీలు

ఇసుక లారీ ఇష్టారాజ్యం

మహదేవపూర్(కాళేశ్వరం), ఫిబ్రవరి 23 : మండల కేంద్రంతో పాటు కాళేశ్వరం ప్రధాన రహదారుల వెంట ఇష్టారీతిన ఇసుక లారీలను పార్క్ చేయడంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహదేవపూర్ ప్రభుత్వ దవాఖానకు ఎదురుగా పదుల సంఖ్యలో ఇసుక లారీలు పార్క్ చేయడంతో రోగులు ఎటు నుంచి ఏ లారీ వస్తుందో అని భయాందోళన చెందుతున్నారు. ఇసుక లారీల కారణంగా ప్రతి రోజూ ఏదో ఒక చోట ప్రమాదం చోటుచేసుకుంటున్నది. దీంతో లారీలను చూస్తేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడమ లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నాతాధికారులు స్పందించి లారీలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా చూడాలని కోరుతున్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ఏటూరునాగారం, ఫిబ్రవరి 23 : మండలకేంద్రంలో ఆదివారం హనుమకొండలోని శ్రీనివాస కిడ్నీ సెంటర్ నిర్వాహకుడు యూరాలజిస్టు రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిడ్ని వ్యాధితో బాధ పడుతున్న సుమారు 300 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక స్రవంతి నర్సింగ్ హోం వైద్యుడు వర ప్రసాద్‌రావు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహా శివరాత్రికి స్పెషల్ బస్సులు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 23 : కాళేశ్వర ముక్తేశ్వరస్వామి దేవాలయంలో 25, 26, 27 తేదీల్లో నిర్వహించే మహా శివరాత్రి వేడుకలకు కాళేశ్వరానికి హనుమకొండ , భూపాలపల్లి నుంచి ప్రత్యేకంగా బస్సులు నడిపిస్తున్నట్లు భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ఆమంచ హిందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల రద్దీని బట్టి బస్సులు నడిపిస్తామన్నారు. ఇప్పటికే నిత్యం పదుల సంఖ్యలో బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు భూపాలపల్లి బస్ స్టేషన్ ఎంక్వయిరీ 73828 54256 నంబర్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

నేటి ప్రజావాణి రద్దు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 23 : నేడు (సోమవారం) కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో శాసన మండలి ఎన్నకల ప్రవర్తనా నియమావళి అమలు, జిల్లా యంత్రాంగం ఎన్నికల విధుల్లో నిమగ్నమైనందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. దీనిని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

సేవాలాల్ జయంతి ఆహ్వాన పత్రిక అందజేత

ములుగురూరల్, ఫిబ్రవరి 23 : సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవానికి రావాలని కోరుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. 28వ తేదీన జిల్లా కేంద్రంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. కమిటీ కన్వీనర్లు పోరిక సర్వన్‌కుమార్, జయరాం, నాయకులు మోహన్‌లాల్, సునీల్‌కుమార్, బాలునాయక్, రమేశ్, తిరుమల్‌సింగ్, రాజు, కసన్‌సింగ్, రఘురామ్, తిరుపతి, కుమార్‌పాడ్య, రాహుల్‌నాయక్ ఉన్నారు.

ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా ప్రభాకర్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 23 : ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొమురం ప్రభాకర్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం సమావేశం స్థానిక గిరిజన భవన్‌లో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కోటె రవి నియామక పత్రాన్ని ప్రభాకర్‌కు అందజేశారు. ప్రభాకర్ ఐటీడీఏలో పెసా జిల్లా కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. సమావేశంలో గౌరవ సలహాదారుడు పొదెం కృష్ణప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఐలబోయిన వీరయ్య, జిల్లా అధ్యక్షుడు మంకిడి రవి, సోషల్ మీడియా ఇన్‌చార్జి చందా మహేశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడి నుంచి నియామక పత్రం అందుకుంటున్న ప్రభాకర్

ఆపదలో ఉన్నవారికి అండగా జయశంకర్ ఫౌండేషన్

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 23 : ఆపదలో ఉన్నవారికి ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ అండగా ఉంటున్నదని ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి అన్నారు. లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు పూదరి దత్తాగౌడ్ సహకారం, ఫార్చున్ మెడ్‌కేర్ ఆసుపత్రి కరీంనగర్ వారి సౌజన్యంతో ఆదివారం జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గుండె జబ్బుల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ శిబిరంలో సుమారు 347 మందికి వైద్యులు పరీక్షలు చేసి సూచనలు చేశారన్నారు. కార్యక్రమంలో ఫార్చున్ మెడ్ కేర్ ఆసుపత్రి క్యాంపు ఇన్‌చార్జి గజవెల్లి గణేశ్, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బల్ల శ్రావణ్, యూత్ ప్రెసిడెంట్ చింతకింది రాజు, రేగొండ ఇన్‌చార్జి ఆకుల ప్రతాప్, సంపత్ పాల్గొన్నారు.

గుండె జబ్బుల నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆగిఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

ధ్వంసమైన వెనుక లారీ ముందు భాగం

గణపురం, ఫిబ్రవరి 23 : మండలంలోని మైలారం గ్రామం పరిధిలో ప్రధాన రహదారిపై ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో వెనుక లారీ ముందు భాగం దెబ్బతిన్నది. దీంతో పరకాల-భూపాలపల్లి రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై రేఖ అశోక్ పోలీస్ సిబ్బందితో వెళ్లి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.